ఆత్రతగా కవరు చింపాడు సుధాకర్. "హుర్రే! ఎల్లుండి నాకు ఇంటర్వ్యూ ... కంపెనీలో!" ఉత్సాహంగా చెప్పాడు.

అందరూ సంతోషంగా చూశారు. సుధాకర్ పక్కనే కూర్చుని ఉన్న ప్రసాద్ — ఎదురింటి వా రబ్బాయి—"బెస్టాఫ్ లక్" అంటూ మిత్రుని భుజం చరిచాడు.

"ఈ శుభ సమయంలో అందరికీ స్వీటు" అంటూ పాకెట్ విప్పింది సుమతి. "ఇక రెండో వార్త వినండి! ఇందాకనే ఆఫీసుకి ఫోన్‌చేసింది, ప్రెస్‌లో పనిచేస్తున్న ఒక్ర ఫ్రెండ్. మాలతి రిజల్ట్సు వచ్చాయుట." ఎఫెక్ట్ కోసం కాస్సేపు ఆగింది.

"నువ్వా,— నీ సస్పెన్సూ! త్వరగా చెప్పవే, తల్లీ!" విసుక్కుంది మాలతి.

"తమరికి బి. ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయినట్లు తెలిసింది." అనౌన్స్‌మెంట్ పూర్తి చేసి చప్పట్లు కొట్టింది సుమతి. "ఇదిగో బహుమతి!"

"అక్కా!" ఆనందంగా సుమతిని వాటేసుకుంది మాలతి. పాకెట్ విప్పుతూ "ఎంత బాగుందే చీర! ఈ టై ఏమిటి?" అంది.

"అది అన్నయ్యకోసం! అన్నయ్యా! ఇది చాలా లక్కీ 'టై'ట. అది వేసు

## శ్యామల

కొని ఇంటర్వ్యూకి వెళితే దాని వశీకరణ శక్తికి లొంగని వాడు ఉండడట.

"అమ్మా! నీకూ ఓ గుడ్ న్యూస్. మామయ్య రేపు ఇక్కడికి వస్తున్నాడట— ఇందాక వాళ్ళ ఊరాయన ఒకరు కనిపించి చెప్పారు. నాన్నగారూ! మీకూ ఉంది శుభ వార్త... వచ్చే వారం నించి స్వామి చిన్మయా లెక్చర్స్ మొదలవుతాయిట మన ఊర్లో." అలిసిపోయినట్లు కూలబడింది సుమతి, తల్లి ఇచ్చిన కాఫీ అందుకుంటూ.

"నిజంగానే చాలా వార్తలు మోసుకొచ్చా వమ్మా!" చిరునవ్వుతో అన్నారు గోపాలరావుగారు.

"అందరికీ తెచ్చావు శుభ వార్తలు. నాకు తేలేదు!" నవ్వాడు ప్రసాద్.

"నీకా ... ఉండు, ఆలోచిస్తాను— ఏమయినా తడుతుందేమో?" జవాబిచ్చింది సుమతి. "అయినా, నీకు నేనేం శుభవార్తలు తేగల నబ్బా?!"

"నువ్వే తీసుకురావాలి నా శుభ వార్త — ఇంకెవరికి సాధ్యమవుతుంది?" అందరూ ఆ మాటలను హాస్యంగా తీసుకున్నా, వాటిలోని శ్లేషని సుమతి గ్రహించింది. అతని మనసు తన మీద లగ్నమయినట్లు అడపాతడపా సూచనలు ఇస్తున్నాడు — అనుకుంది.

• • •

మరునాడు అన్నతోబాటు స్టేషన్‌కి వెళ్ళిన సుమతికి, మాలతికి అక్కడ ప్రసాద్ కనిపించాడు. రైలు కదిలాక ఇంటికి తిరిగి వస్తూంటే స్నేహితురాలిని కలుసుకోవాలని వెళ్ళిపోయింది మాలతి. సుమతితో నిశ్శబ్దంగా కొంత దూరం నడిచాక ఉపోద్ఘాతం లేకుండా అన్నాడు ప్రసాద్: "సుమా! చిన్నప్పటి నుంచి ఎదు రెదురు ఇళ్ళలో పెరిగాం మనం. నువ్వు మా ఇంటికే వచ్చేయాలని నా కోరిక." కాస్సేపు ఏమీ మాటాడలేదు సుమతి. "నేను ఫ్రాంక్‌గా మాట్లాడితే, ఏమీ అనుకోవుగా, ప్రసాద్?! కోపం తెచ్చుకోనని ప్రామిస్ చేయి!"

"నువ్వు మనసు విప్పి మాటాడటమే నాకు కావలసింది. ప్రామిస్! సరేనా?" నవ్వుతూ సుమతి చేతిలో చేయి వేసి ప్రామిస్ చేశాడు.

"నీ జీతం నెలకు నాలుగు వందలు ఉంటుందేమో, ప్రసాద్? ఈ డబ్బుతో నువ్వు మీ అమ్మ, నాన్నగార్లని సపోర్టు చేయాలి. ఇద్దరు తమ్ముళ్ళ చదువులు పూర్తి కావాలి. చెల్లెలి పెళ్ళిచేయాలి. ఇన్ని బాధ్యతలు నీ జీతంతో నెరవేర్చటమంటే—" అర్థోక్తిలో ఆగింది సుమతి, అతని ముఖంలో మారుతున్న రంగులని చూస్తూ.

ప్రసాద్‌కి ఆ మాటలు ఏదో అవమానంగా తోచినా, ఇచ్చిన ప్రామిస్‌కి కట్టుబడిపోయి నిగ్రహించుకొని అన్నాడు: "నాన్నగారికి పెన్షన్ ఉన్నది. పెద్ద తమ్ముడి ఎమ్. ఎ. ఈ ఏటితో అయిపోతుంది. వాడికీ ఉద్యోగం వస్తే బాధ్యతలు నాతో పంచుకుంటాడు."

"అదంతా నిజమే! కాని, నా కోరికలు వేరు, ప్రసాద్! తిండి, బట్టలకి, ఇంకా కనీస సుఖాలకి వెతుక్కో నక్కర్లేని జీవితం పొందాలనేది నా ఆశ. నా కలల్లోని రాజకుమారుడు నన్ను కారులో కాకపోయినా, స్కూటర్ పైనయినా తిప్పగలగాలి. ఇంకా అందమైన పూలతోట ఉన్న చిన్న బంగళా — ఇటువంటి కలలెన్నో!"

"నీ మనసు తెలియక అడిగాను, సుమా! క్షమించు. వస్తాను!" పక్కనున్న సందులోకి వెళ్ళిపోయాడు ప్రసాద్.

ఏదో తెలియని భావాలతో మనసు భార మవగా, నిట్టూర్చి నడక సాగించింది సుమతి.

• • •

"సుమా! అన్నయ్య ఉత్తరం రాశాడమ్మా." ఆఫీసు నించి రాగానే కూతురుతో చెప్పారు గోపాలరావుగారు.





ముద్దు మురిపెము

—ఎస్. ఆర్. నాయక్ ( చిత్తూరు )

అయింది. ఇంకా ఎందుకు పెళ్ళిచేసుకో లేదో?! తనపైన ప్రేమవల్లనేనా? ఆశ్చర్యంగా అనుకుంది.

ఆలోచనల్లో ఉండగానే ప్రసాద్ తల్లి ప్లేటులో స్వీట్స్ తీసుకొనివచ్చి సరస్వతమ్మగారికి ఇచ్చింది. పండగల్లో పిండివంటలు ఇచ్చిపుచ్చుకోవటం వాళ్ళ కుటుంబాలలో మామూలే. ఆవిడ చెపుతున్న మాటలు అనుకోకుండా సుమతి చెవిని పడ్డాయి.

"ప్రసాద్‌కి బొంబాయిలో వేరే పెద్ద ఉద్యోగం చూశాడు మా అన్నయ్య. రమ్మని రాస్తే పెద్దతనంలో నాన్నని విడిచి పెట్టి రాలేనంటూ రాసేశా డమ్మా! వాళ్ళ నాన్నగారికి ఏడాదిక్రితం గుండెపోటు వచ్చినప్పటినించి ఆరోగ్యం సరిగాలేదు కదా, వదినా? రెండోవాడు ఉద్యోగరీత్యా వేరే ఊర్లో ఉంటున్నాడు. మూడో వాడి చదువూ పై ఊర్లోనే. ఇక తనూ వెళ్ళిపోతే వాళ్ళ నాన్న దిగులుతో మరీ దిగజారిపోతాడని అలా రాశాడు..."

రాజేంద్రకీ, ప్రసాద్‌కీ ఎంత తేడా! సుమతికి మనసులో సాగర కెరటాలవలె భావాలు ఉవ్వెత్తున ఎగిరి పడుతున్నాయి.

ఆవిడ చెప్పుకుపోతూనే ఉంది: "ఈ మధ్యనే ప్రసాద్‌కి, రెండో వాడికి సంబంధాలు వచ్చాయి. అమ్మాయి లిద్దరూ అన్నదమ్ముల పిల్లలట. చక్కగా ఉన్నారు. పదేసి వేలు కట్నాలు ఇస్తామన్నారు. నేనూ ఆశపడిన మాట నిజమే. ఈ పెళ్ళిళ్ళు కుదిరితే ఆ డబ్బుతో మా ఆఖరుదాని పెళ్ళి చేయవచ్చని! ప్రసాద్ అసలు పెళ్ళికే ఒప్పుకోలేదు. రెండో వాడిని చేసుకోమన్నాడు, అమ్మాయినచ్చితే. కట్నం తీసుకోవటానికిమాత్రం వీల్లే దన్నాడు. 'ముగ్గురు అన్నలం కలిసి చెల్లెలి పెళ్ళి చేయలేమా? ఎవరిదో డబ్బు తీసుకోవాలా!' అని పోట్లాడాడు."

ఎంతో ఆస్తి ఉన్న శ్యామ్ కట్నం కావాలనుకున్నా, ఏమీ లేని ప్రసాద్ తన ఇంట్లో ఎవరూ కట్నం తీసుకోవటానికి వీల్లేదన్నాడు!

"వాడి మనసు సుమతి పైన ఉందని మా అందరికీ అనుమానం! ఎప్పుడు పెళ్ళిచేసుకుంటావని నిగ్గదీసి అడిగితే— 'సుమతి పెళ్ళయినాక' అన్నాడు."

ప్రతి పువ్వు మీద వాలే భ్రమరాల్లాంటి పురుషులున్న ఈ లోకంలో ప్రసాద్ ఇంకా తన కోసం ఎదురు చూస్తున్నాడు. స్కూటర్ లేదని, బంగళా లేదని తను కాదన్నది ఇతనినేనా? 'ఎంతో తెలివైనదాన్ననుకునే నేను ఇంత మూర్ఖురాలినా?' కలవరపడింది సుమతి.

మర్నాడు మధ్యాహ్నం ఎదురింటికి వెళ్ళి వస్తున్న సుమతిని అడిగింది మాలతి హాస్యంగా: "అక్కా! నీ కలల్లోని రాజకుమారుడు దర్శనమయే దెప్పుడు? అస లెప్పటికయినా కనిపిస్తాడంటావా?"

"చాలాకాలంగా కనిపిస్తూనే ఉన్నాడు, మాలా! నేనే గుర్తించలేకపోయాను" అంటూ సుమతి వెనకగా వస్తున్న ప్రసాద్ వైపు చూసింది చిరునవ్వుతో. *